క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

• కమిషనర్ బాలాజీప్రసాద్



లక్ష్మీదేవిపేట చెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్న కమిషనర్ బాలాజీప్రసాద్

నెల్లిమర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ పేర్కొన్నారు. స్వచ్ఛతహే సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో ముగ్గులు వేశారు. అలాగే లక్ష్మీదేవి పేట చెరువు వద్ద పరిసరాలను శుభ్రం చేసి, చెరువులో చెత్తాచెదారాలను తొలగించడం గురించి పరిసర ప్రజలకు కమిషనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టరు డి.ఉమాభాస్కర్, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం



బంగారమ్మను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు

పూసపాటిరేగ: మండల పరిధిలో గల పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పూసపాటిరేగ వేదికగా ఆత్మీయంగా మంగళవారం కలుసుకున్నారు. పూసపాటిరేగలో ఎంతో కాలంగా అంగన్‌వాడీ కార్యకర్తగా సేవలు అందించిన దంతులూరి బుచ్చిబంగారమ్మ పదవీ విరమణ కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు అందరూ తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సత్యవతి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.


అదిరేటి డ్రస్సు మేమేస్తే...



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

విజయనగరం: బ్రైడ్స్ ఆఫ్ ఇండియా అనేది ఒక కొత్త కార్యక్రమమని, భారతదేశంలో ఉన్న విభిన్న సంస్కృతుల కలయికని రోటరీ సభ్యులు రెయ్యి శంకరరెడ్డి, బలభద్రుని అశోక్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో యువజన మాసోత్సవాలలో చివరి కార్యక్రమం బ్రైడ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో 70 మంది పోటీదారులు పాల్గొన్నారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. కార్యక్రమ చైర్మన్ దినేష్ జైన్ మాట్లాడుతూ విజేతలకు రూ.60 వేలు విలువ చేసే గిఫ్ట్ కూపన్‌లు బహుమతులుగా అందజేయనున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కాపుగంటి ప్రకాష్, కృష్ణ గోపాల్ అగర్వాల్, జగదీష్, ముఖేష్, మధు, మారుతీ ఆనంద్, ఇన్నర్ వీల్ సభ్యులు సుధ తదితరులు పాల్గొన్నారు.

'ద్వారకామయి'కి నిత్యవసరాల పంపిణీ



ద్వారకమయి పాఠశాల వద్ద కుట్టు మిషన్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం: వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఫూల్‌బాగ్‌లో ఉన్న ద్వారకమయి అంధుల పాఠశాల విద్యార్థులకు బియ్యం, నిత్యవసర వస్తువులు మంగళవారం పంపిణీ చేశారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళకు కుట్టు మిషన్ అందించారు. ఈ సందర్భంగా వనిత విజయం అధ్యక్షురాలు ప్రభ మాట్లాడుతూ క్లబ్ ప్రారంభం నుంచి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, కుసుమంచి వెంకటరావు, గుప్త, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు వేగవంతం



సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్, ఇతర అధికారులు

• సిరిమాను సంబరానికి ఇబ్బందులు ఉండకూడదు
• కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీ రాములనాయుడు

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పైడితల్లమ్మ జాతరలో సిరిమాను తిరిగే ప్రాంతంలో ఎక్కడా ఎటువంటి మరమ్మతులు లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం హుకుంపేట నుండి కోట వరకు సిరిమాను తిరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఇంజినీరింగ్, పారిశుద్ధ్య అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన క్షేత్రస్థాయి పర్యటన చేసి, చేపట్టాల్సిన పనులు గూర్చి వివరించారు. ముఖ్యంగా హుకుంపేట నుండి సిరిమాను బయలుదేరే సమయం నుండి కోట వరకు ఉన్న రహదారి మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గుంతలు పూడ్చివేతకు చర్యలు చేపట్టాలన్నారు. కాలువలలో పేరుకుపోయిన పూడికలను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశించారు. ఆయా ప్రాంతాలలో వీధి దీపాలు సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా పైపులైను మరమ్మతులను చేపట్టాలన్నారు. లీకులను సరిచేసి నీటి పంపిణీకి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పురాతన భవనాలు, వాటి స్థితిగతులపై సమీక్షించారు. పాడుపడ్డ భవనాలపై భక్తులను అనుమతించకుండా చూడాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. హుకుంపేట మార్గాన్ని పరిశీలించామని, అక్కడక్కడ ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చివేయాలని అధికారులకు ఆదేశించామన్నారు. అందరి సమన్వయంతో అంబరాన్నంటే సిరిమాను సంబరాన్ని వైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30 వేల ఎకరాల ఎసైన్డ్ భూమి క్రమబద్ధీకరణ



రికార్డులు పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

పూసపాటిరేగ: జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీ పట్టా మంజూరు చేసి వున్న 30 వేల ఎకరాలు ఎసైన్డ్ భూమికి త్వరలో క్రమబద్ధీకరణ జరుగుతోందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అన్నారు. మండలంలోని తులసిదిబ్బ సమీపంలో అసైన్డ్ భూమిని జాయింట్ కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఎసైన్డ్ భూములు రికార్డులు పరిశీలించారు. మండల పరిధిలో డీ పట్టాదారులు వివరాలు, సాగు, ఎసైన్డ్ రిజిస్టర్‌లో వివరాలను ఇప్పటికే పరిశీలన చేసి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసాం అని తహసీల్దార్ భాస్కరరావు తెలిపారు. సాగులో వుండి డీ పట్టా వేరే వ్యక్తులు పేరిట వున్నప్పుడు ప్రస్తుతం క్రమబద్ధీకరణ జరగదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం డీ పట్టా కలిగి వుండి సాగులో అదే వ్యక్తి వున్నప్పుడు క్రమబద్ధీకరణ జరుగుతోంది అన్నారు. 22 ఏలో ఉండి రిజిస్ట్రేషన్ అయిన జిరాయితీగా భూములు ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకుంటే 22 ఏ నుండి తొలగిస్తామన్నారు.అసైన్డ్ భూముల జాబితాలను సచివాలయంలో ప్రదర్శిస్తామన్నారు. అభ్యంతరాలు ఉంటే అప్పీలు చేసుకోవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురితో పాటు పలువురు రైతులు ఉన్నారు.

నగర పంచాయతీ కార్మికుల ఆందోళన



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

నెల్లిమర్ల: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీల అమలు చేయకుండ, శాంతియుత నిరసనలకు అనుమతించకుండా నిర్బంధాన్ని ప్రయోగిస్తుందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ - ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి పరిష్కరించకపోతే కలిసి వచ్చే సంఘాలతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు సిద్ధం కాబోతున్నామని హెచ్చరించారు. స్థానికంగా 4సంవత్సరాల నుంచి సబ్బులు, నూనెలు, చెప్పులు యూనిఫామ్ వంటి రక్షణ పరికరాలు ఇవ్వడం లేదని, ఇటీవల అనారోగ్యంతో మరణించిన తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి బాబు రావు, లక్ష్మి, దుర్గారావు, హరిబాబు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరు పోలింగ్ కేంద్రాల మార్పు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ నూకరాజు

నెల్లిమర్ల: నియోజకవర్గంలో ఆరు ఎన్నికల పోలింగ్ కేంద్రాలు మార్పు చేయడం జరుగుతుందని ఈఆర్ఓఎం ఎం.నూకరాజు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఎలక్ట్రోల్ రిటరిన్నింగ్ అధికారి రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ నూకరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 205 ఎన్నికల పోలింగ్ కేంద్రాలకుగాను ఆరు కేంద్రాలు మార్పు చేయటానికి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నెల్లిమర్లలో 1, డెంకాడలో 1, పూసపాటిరేగలో 4 కేంద్రాలు మార్పు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు ఓటర్ల జాబితా సవరణలో తేడాలు ఉన్నాయని, బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఆయా కేంద్రాల్లో చేసిన సర్వేకి తేడాలు ఉన్నాయని వాటిని సవరించాలని ఈఆర్ఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఈఆర్ఓ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని, వచ్చే నెల 17న తుది జాబితా ప్రచురణ జరిగిన తర్వాత సరవణలుంటే సరిచేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ ధర్మరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సముద్రపు రామారావు, టీడీపీ నాయకులు కంది చంద్రశేఖర్, కడగల ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలు పాటలు మధురం



గాయనీ, గాయకులను సత్కరిస్తున్న డాక్టర్ శ్రీరామూర్తి

విజయనగరం టౌన్: దివంగత సినీ గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పాటలు మధురమైనవని, ప్రజల మన్ననలు ఎప్పుడూ పొందుతూనే ఉంటాయని ప్రముఖ ఎముకుల వైద్య నిపుణులు డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం కళాపీఠం ఆధ్వర్యంలో మంగళవారం బాలు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వేలమూరి నారాయణ మాస్టారును సత్కరించారు. అనంతరం ట్రాక్ సినిమా పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహాలక్ష్మి, శ్రీనివాసరావు, తేజస్వినిలకు నగదు బహుమతులు అందజేశారు. 20 మందికి ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 మంది నూతన గాయనీ, గాయకులు అద్భుతంగా గానాలాపన చేశారన్నారు. కళాపీఠం ద్వారా ప్రతినెలా జరిగే సంగీత విభావరికి నూతన గాయకులకు అవకాశం కల్పిస్తున్నట్లు కన్వీనర్ పద్మనాభం తెలిపారు. అనంతరం వృత్తి కళాకారులకు ఆరోగ్య కార్డులు డాక్టర్ శ్రీకర్ అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కళాకారులు, గాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని గువ్వపేట మినీ అంగన్‌వాడీ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు భోగాపురం సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, అదనపు సమగ్ర శిశు అభివృద్ధి అధికారి బీటీ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టును ఓసీ కేటగిరికి కేటాయించినట్టు పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయానికి నేరుగా గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా గాని దరఖాస్తులు అందజేయాలన్నారు. 1 జూలై 23 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. స్థానిక నివాసితురాలై, వివాహితురాలై ఉండాలని తెలిపారు.

శ్రీనివాసునికి పంచామృతాభిషేకాలు



శ్రీనివాసునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్ట లక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి మంగళవారం పంచామృతభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ శ్రీనివాసునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమన్నే, భక్తులు పాల్గొన్నారు.

29న విజయనగరంలో ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ హృదయ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 29న తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ కె.తిరుమ ప్రసాద్ తెలిపారు. స్థానిక తిరుమల మెడికవర్ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 29న ఉదయం కోట నుంచి ర్యాలీ ప్రారంభమై తిరుమల మెడికవర్ ఆస్పత్రి వరకు ర్యాలీ సాగనుందని తెలిపారు. ర్యాలీని ఎస్పీ దీపికా పాటిల్ ప్రారంభిస్తారన్నారు. ర్యాలీ అనంతరం గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆస్పత్రిలో ఉదయం 7 గంటలకు ఉచిత గుండె తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి వైద్యులు పి.ఎస్.వి.రామారావు, శరత్ కుమార్ పాత్రో, జి.వాసుబాబు, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

5న విశాఖలో 'ఉక్కు' పరిరక్షణ బహిరంగ సభ

విజయనగరం ఫూల్‌బాగ్: విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుండి ఉత్తరాంధ్ర బైక్ యాత్ర సాగుతుందని, ముగింపుగా అక్టోబర్ 5న విశాఖ కూర్మన్నపాలెం వద్ద భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు కోరారు. ఆ సభకు సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరవుతారని తెలిపారు. నగరంలోని మార్కెట్ కలాశీల వద్ద మంగళవారం జరిగిన ప్రచార సభలో సభకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. 32మంది ప్రాణ త్యాగాలు, వీరోచిత పోరాటంతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రంలో బీజేపీ కుట్ర పన్నుతుందని విమర్శించారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఐదు వేల పోస్టులను భర్తీ చేయాలని, పరిశ్రమ నిర్వహణకు రూ.5వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేంత వరకు సీపీఎం పోరాడుతుందని అన్నారు. బహిరంగ సభలకు కార్మికులంతా కదలి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేస్త్రి బంగారప్పడు, గౌరీ, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు విజయనగరం కలెక్టర్ వద్ద మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, కాస్మోటిక్ చార్జీలు అందించాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు సమకూర్చాలని కోరారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందించి, మధ్యాహ్న భోజనం, వసతి కల్పించాలని, గవర్నమెంట్ డిగ్రీ కళాశాలకు సొంత భవనం సమకూర్చాలని కోరారు. తదనంతరం విద్యార్థులంతా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. దీంతో పోలీసులు 35 మంది విద్యార్థి సంఘ నాయకులను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.రామకృష్ణ, వి.చిన్నబాబు, ఎం.సౌమ్య, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే జగనన్న ప్రభుత్వం



41వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

విజయనగరం: ప్రజలకు అవసరమైన సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమ్మన్నశెట్టి పేర్కొన్నారు. నగరంలోని 41వ డివిజన్ అంబేడ్కర్ కాలనీ పరిధిలో మంగళవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందించారు. స్థానిక సమస్యలపైనా అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల సమస్య ఉందని స్థానికులు చెప్పడంతో అక్కడున్న అధికారులకు సమస్య పరిష్కారానికి తగు చొరవ చూపాలని సూచించారు. నగరంలో అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి కృషి చేస్తున్నారని, మిగిలి ఉన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. స్థానిక కార్పొరేటర్ సుంకరి నారాయణస్వామి, కోఆప్షన్ సభ్యుడు రహీం, జోనల్ ఇన్‌చార్జి దూబే తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అవగాహన ర్యాలీ



స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం

విజయనగరం: పరిసరాల పరిశుభ్రతపై విజయనగరం కార్పొరేషన్ యంత్రాంగం మంగళవారం స్వచ్ఛత అవగాహన ర్యాలీ నిర్వహించింది. చారిత్రక కట్టడాలు మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలుగా అలరారుతాయని, అటువంటి ప్రదేశాలలో చెత్తాచెదారాలు వేయకుండా స్వచ్ఛత పాటించాలంటూ ప్రజారోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. విజయనగరం కోట వెనుక భాగంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పారిశుద్ధ్య విభాగ పర్యవేక్షకులు, సిబ్బంది కార్యదర్శులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలలో స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. నినాదాలు చేస్తూ చైతన్య పరిచారు. స్వచ్ఛభారత్ మిషన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చారిత్రక నేపథ్యం ఉన్న కట్టడాలు, భవనాల వద్ద పూర్తి స్వచ్ఛత పాటిస్తే అటువంటి ప్రదేశాలు మరింత ఆదర్శంగా నిలుస్తాయన్న భావనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పర్యావరణ ఇంజినీర్ వెంకట్ తెలిపారు.

సంఘాలు ప్రజా సేవకు అంకితమవ్వాలి



పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

విజయనగరం: సంఘాలు నిత్యం ప్రజా సేవలో పరితపించాలని అప్పుడే సంఘాలు బలోపేతమై ప్రజలు మన్ననలు పొందుతాయని ప్రముఖ న్యాయవాది బొడ్డు సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో మంగళవారం జరిగిన పట్టణ ఆర్య వైశ్యుల సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యులు సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషి చేయాలని అప్పుడే సంఘాలు పట్ల మంచి అభిప్రాయం కలుగుతుందన్నారు. ఆర్యవైశ్య సంఘాలు చేపట్టే కార్యక్రమాలకు తన సహకారం అందిస్తానని స్పష్టం చేసారు. అనంతరం 2023 - 25 సంవత్సరానికి సంబంధించిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెత్సా సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కోశాధికారిగా విజ్జపు వెంకట శ్రీనివాసరావులతో బాటు సభ్యులతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు.